సాక్షి అనంతపురం

బుధవారం । 27 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.25 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.33	సెహరీ : 5.02



సూర్యతేజం.. చంద్రహాసం



చంద్రప్రభ వాహనంపై నారసింహుడు

కదిరి: ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 8వ రోజైన మంగళవారం ఖాద్రీశుడు పగలు సూర్య ప్రభ, రాత్రి చంద్ర ప్రభ వాహనాలపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. లోకంలో పుట్టడం, పెరగడం, నశించడం అనే మూడు ప్రక్రియలు కాలాధీనాలు. ఆ కాల స్వరూపుడిని తానేనంటూ శ్రీవారు సూర్య, చంద్ర ప్రభలను అధిష్ఠించి దర్శనమిచ్చారని అర్చకులు తెలిపారు. పగటికి సూర్యుడు రారాజైతే, రేయికి చంద్రుడు అధిపతి. సృష్టికి ఎంతో ముఖ్యమైన ఈ రేయింబవళ్లను శ్రీమహావిష్ణువు రెండు కళ్లుగా కలిగి ఉండి వాటినే వాహనాలుగా మార్చుకొని సృష్టిలో సర్వమూ తానే అని చాటి చెబుతూ తిరువీధుల్లో దర్శనమిచ్చారు.

ఆ నియోజకవర్గాలపై ప్రత్యేక గురి

- జిల్లాలో 4 నియోజకవర్గాలను అధిక వ్యయం జరిగేవిగా గుర్తింపు
- మూడు సమస్యాత్మకమైనవిగా నిర్ధారణ
- వీటిపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి
- నిరంతర నిఘాకు ఏర్పాట్లు

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు అధిక వ్యయం చేసే ప్రాంతాలపై దృష్టి సారించింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అధిక వ్యయం జరిగే ఆస్కారం ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రి, రాయదుర్గం నియోజకవర్గాలను సున్నితమైనవి (ఎక్స్‌పెండేచర్ సెన్సిటివ్)గా వర్గీకరించారు. వీటిల్లో ధన, వస్తు సామగ్రి రూపంలో అధిక వ్యయం ఉంటుందని ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇచ్చారు.

నిరంతర నిఘా..

ఆయా నియోజకవర్గాలపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక నిఘా ఉంచింది. అధిక వ్యయానికి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఫ్లయింగ్ స్క్వాడ్స్, స్టాటిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలను అప్రమత్తం చేసింది. నిరంతరం ప్రత్యేక నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటోంది.



కేంద్ర బలగాలతో కలిసి తాడిపత్రిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

అదనపు బందోబస్తు..

ఇక.. జిల్లాలో 8 నియోజకవర్గాల పరిధిలోని 2,236 పోలింగ్ కేంద్రాల్లో 1,032 క్రిటికల్ (క్లిష్టమైనవి) కేంద్రాలుగా గుర్తించారు. తాడిపత్రి నియోజకవర్గంలోని 274 కేంద్రాల్లో 180, రాప్తాడు పరిధిలోని 281 కేంద్రాల్లో 132, ఉరవకొండలోని 263 కేంద్రాల్లో 150, శింగనమలలోని 293 కేంద్రాల్లో 171, రాయదుర్గంలోని 296 పోలింగ్ కేంద్రాల్లో 109, గుంతకల్లులోని 276 కేంద్రాల్లో 108, అనంతపురం అర్బన్‌లోని 292 కేంద్రాల్లో 95, కళ్యాణదుర్గంలోని 281 పోలింగ్ కేంద్రాల్లో 87 క్లిష్టమైనవిగా వర్గీకరించారు. పోలింగ్ రోజున అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఆయా కేంద్రాల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఆయా ప్రాంతాల్లో పోలీసులు ఇప్పటికే గస్తీ పెంచారు. కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు చేపట్టారు. ప్రజలకు భరోసా కల్పించారు.

3 సమస్యాత్మక నియోజకవర్గాలు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 3 నియోజకవర్గాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. తాడిపత్రి, రాప్తాడు, ఉరవకొండ నియోజకవర్గాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకునేందుకు ఆస్కారం ఉన్నట్లు నిర్ధారించారు. అదే విధంగా శింగనమల నియోజకవర్గంలోనూ చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకునే అవకాశం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో సమస్యాత్మక నియోజకవర్గాలపై కూడా జిల్లా ఎన్నికల, పోలీసు యంత్రాంగాలు ప్రత్యేక దృష్టి సారించాయి. పటిష్ట బందోబస్తుతో పాటు కట్టుదిట్టమైన నిఘా వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నాయి.

మా కళాశాలలో చేరండి.. ఉన్నత భవిత పొందండి

- అధ్యాపకుల వినూత్న ప్రచారం



పదో తరగతి పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తూ చాక్లెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ వీరేష్, అధ్యాపకులు

రాయదుర్గంటౌన్: 'మా కళాశాలలో చేరండి, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన బోధన అందిస్తాం. ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తాం' అంటూ రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం చేస్తుండడం ఆకట్టుకుంటోంది. 2024–25 విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల సంఖ్య పెంచుకోవడంలో భాగంగా అధ్యాపకులు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం పట్టణంలో పదో తరగతి పరీక్షలు జరుగుతున్న 6 కేంద్రాల వద్దకు వెళ్లి విద్యార్థులకు కరపత్రాలను పంపిణీ చేశారు. చాక్లెట్లు సైతం పంపిణీ చేసి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రైవేటు కళాశాలల వైపు దృష్టి సారించకుండా ఉండడానికి ఇప్పటి నుంచే ప్రచారం చేస్తున్నట్లు చెప్పారు. గతానికి, ప్రస్తుతానికి ప్రభుత్వ కళాశాలల్లో వసతులు మెరుగయ్యాయని, అధ్యాపకులు సంఖ్య కూడా పెరిగిందన్నారు. హాస్టల్ వసతి, దూరప్రాంత విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం, రోజూ స్టడీ అవర్స్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తమ కళాశాలలో చేరి భవితకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

● ఆదరించండి.. ఆ 'దరువవుతా'



ఎన్నికల ప్రచారంలో శింగనమల వైఎస్సార్ సీపీ అభ్యర్థి వీరాంజనేయులు దూసుకుపోతున్నారు. వినూత్నంగా ప్రజలతో మమేకమవుతున్నారు. అందరిలో ఒకడిలా కలిసిపోతున్నారు. కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమాభివృద్ధిని వివరిస్తున్నారు. మంగళవారం పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామంలో ప్రచారం నిర్వహించిన ఆయన.. తనకు స్వాగతం పలికిన ప్రజలతో కలివిడిగా గడిపారు. ఈ క్రమంలోనే దరువేసి అందరినీ ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే అభ్యర్థి అయినా, తమతో కలిసిపోయిన వీరాంజనేయులును చూసి స్థానిక ప్రజలు మురిసిపోయారు. –పుట్లూరు

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. వేసవిలో తాగునీటి సరఫరా కార్యాచరణపై మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నిధులు అందుబాటులో ఉన్నాయని, కోరిన వెంటనే మంజూరు చేస్తామన్నారు. తాగునీటి సరఫరాలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. నీటి సరఫరా పథకాల నిర్వహణకు సంబంధించి మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. రాయదుర్గం ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా ఇబ్బందులుంటే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలన్నారు.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

తాగునీటి సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు జిల్లా, మునిసిపల్ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లపై విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. 'నీటిని సంరక్షించు' నినాదంతో నీటి వృథా అరికట్టడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇహషాన్‌బాషా, డీపీఓ ప్రభాకర్‌రావు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, ఏడీ వివేకానందస్వామి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, హెచ్ఎల్‌సీ ఎస్ఈ రాజశేఖర్, ప్రజారోగ్య శాఖ ఎస్ఈ శ్రీనాథ్‌రెడ్డి, ఈఈ సతీష్‌రెడ్డి, నగర పాలక సంస్థ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, భూగర్భ జల శాఖ డీడీ తిప్పేస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్

క్లుప్తంగా

3,074 మంది గైర్హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన బయలాజికల్ సైన్స్ పరీక్షకు జిల్లాలో 3,074 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 31,330 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 30,944 మంది, 5,057 మంది ప్రైవేట్ విద్యార్థులకు గాను 2,369 మంది హాజరయ్యారు. రెండు కేంద్రాలను జిల్లా విద్యాశాఖ అధికారి వరలక్ష్మి, మరో రెండు కేంద్రాలను ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్, 27 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. అలాగే సార్వత్రిక విద్యాపీఠం పరీక్షల్లో భాగంగా ఇంటర్ పరీక్షలకు 2,599 మందికి గాను 2,391 మంది హాజరయ్యారు. 208 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలకు 850 మందికి గాను 778 మంది విద్యార్థులు హాజరయ్యారు. 72 మంది గైర్హాజరయ్యారు.

కేశవ్ జీవితమంతా అరాచకాలే

- నియోజకవర్గ ఎన్నికల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బెస్త రమణ



మాట్లాడుతున్న బెస్త రమణ

ఉరవకొండ: ఎమ్మెల్యే కేశవ్ జీవితమంతా అక్రమాలు.. అరాచకాలేనని, ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ప్రజా సమస్యలను గాలికొదిలేసి ముఖం చాటేసిన ఘనుడని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జ్ బెస్త రమణ ధ్వజమెత్తారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ రాకముందే మహిళలను మభ్యపెట్టడానికి ఎమ్మెల్యే కేశవ్ చీరల పంపిణీ చేపట్టారన్నారు. అమరావతిలో భూముల వ్యాపారం చేసి రూ.కోట్లు కొల్లగొట్టగా వచ్చిన అవినీతి సొమ్ముతో ఓట్లు కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. గత ఎన్నికల్లో పేదలకు దొంగపట్టాలు పంపిణీ చేసి మోసం చేసిన నీచమైన చరిత్ర కేశవ్‌దన్నారు. తన సొంత గ్రామం కొకుంట్లనే పేకాట క్లబ్‌గా మార్చి జూదాలను ప్రోత్సహించారన్నారు. ఎన్నికల సమీపిస్తున్న ప్రస్తుత తరుణంలో మరోసారి మోసగించేందుకు ప్రజలకు ముందుకు వస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా ఈ సారి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిదే గెలుపని ధీమా వ్యక్తం చేశారు.

అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట

- సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగేలా పోలీసుల చర్యలు
- మట్కా, పేకాట రాయుళ్లపై 133 కేసుల నమోదు
- ఇప్పటి వరకూ 722 మంది అరెస్ట్, 99 వాహనాలు... 73 మొబైళ్లు స్వాధీనం
- జనవరి 1 నుంచి మొత్తం రూ.61,44,140 నగదు సీజ్



పార్శిల్ కేంద్రంలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న పోలీసులు

అనంతపురం: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో అసాంఘిక శక్తులకు అడ్డు కట్ట వేయడమే కాక స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలకు అండగా నిలుస్తామని డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి, ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ భరోసానిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా వ్యాప్తంగా సివిల్, కేంద్ర బలగాలతో కవాతు చేపట్టి ఓటర్లలో ఆత్మస్థైర్యం పెంపొందించే చర్యలు వేగవంతం చేశారు.

రీ పోలింగ్‌కు తావు లేకుండా...

జిల్లాలో ఎక్కడేగాని రీపోలింగ్‌కు తావులేకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రత చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు ప్లటూన్ల కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. మరో మూడు ప్లటూన్ల బలగాలు ఎన్నికల నాటికి జిల్లాకు చేరుకోనున్నాయి. అలాగే 107, 109, 110 సీపీఆర్‌సీ కింద కేసుల్లో ఉన్న రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్లతో పాటు గత ఎన్నికల్లో వివిధ కేసుల్లో ఉన్న సుమారు 4 వేల మందిని బైండోవర్ చేశారు. ఇప్పటి వరకు 654 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్ చేయించారు.

అక్రమ మద్యం కేసుల్లో 1,272 మంది అరెస్ట్

జిల్లాలోకి కర్ణాటక మద్యం ప్రవేశించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల మద్యం చొరబాటుతో పాటు నాటుసారా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకూ కర్ణాటకకు చెందిన 76,448 టెట్రా ప్యాకెట్లు, 7,363 మద్యం సీసాలు, 762 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. 1,272 మందిని అరెస్ట్ చేశారు. 206 వాహనాలు సీజ్ చేశారు. మట్కాబీటర్లు, పేకాట రాయుళ్లపై 133 కేసులు నమోదు చేసి, 722 మందిని అరెస్ట్ చేశారు. 99 వాహనాలు, 73 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జనవరి 1 నుంచి ఇప్పటి వరకూ జూదరుల నుంచి రూ.61,44,140 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల నిబంధనలు పటిష్టంగా

కేంద్ర ఎన్నికల కమిషన్ సూచించిన ఎన్నికల మార్గదర్శకాలను, నిబంధనలను పటిష్టంగా అమలు చేసేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రూ.50 వేలకు మించిన నగదు, రూ.10 వేల కన్నా విలువ చేసే సామగ్రి రవాణాకు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రచార కార్యక్రమాల సమయంలో కూడా రూ.లక్షకు మించి నగదు ఉంటే వెంటనే సీజ్ చేస్తున్నారు.

- భూములు, స్థిరాస్తుల కొనుగోలుకు నగదు తీసుకెళ్తుంటే అందుకు సంబంధించిన దస్తావేజులు, మీ సేవ కేంద్రంలో నమోదు చేసుకున్న స్లాట్ వివరాలు పరిశీలిస్తున్నారు. వివాహాలు, ఇతర శుభ కార్యాలకు బంగారు ఆభరణాలు కొనుగోలు చేసి తరలిస్తుంటే రసీదులను తనిఖీ చేస్తున్నారు. ఉద్యోగులు, కార్మికులు, కూలీలకు సంబంధించిన వేతనాలు ఇచ్చేందుకు నగదు తీసుకెళ్తుంటే వారి జాబితా, నగదు డ్రా చేసిన రసీదు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. వైద్యం నిమిత్తం చెల్లించేందుకు నగదు తీసుకెళుతున్న వారు సైతం సంబంధిత రోగి, ఆస్పత్రి వివరాలు చూపించాలి. రైతులు, సాధారణ పౌరులు, వ్యవసాయానికి, ఇంటి అవసరాలు, పరికరాల కొనుగోలు కోసం నగదు తీసుకెళ్తుంటే ఇన్వాయిస్, కొటేషన్లు వెంటపెట్టుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

చట్ట వ్యతిరేకులను ఉపేక్షించం



చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నవారు ఎంతటి వారినైనా ఉపేక్షించం. ట్రబుల్ మాంగర్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాం. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిబంధనలకు లోబడి విధులు నిర్వర్తించాలని ఇప్పటికే పోలీసు అధికారులను ఆదేశించాం. అనధికార మద్యం విక్రయాలు, నిల్వలు, పంపిణీ, తదితరాలను ప్రజలు గుర్తిస్తే డయల్ 112కు లేదా స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలి. – ఆర్.ఎస్.అమ్మిరెడ్డి, డీఐజీ

సత్ప్రవర్తన ఉంటే రౌడీషీట్ ఎత్తివేత



సార్వత్రిక ఎన్నికల్లో సత్ప్రవర్తన కలిగి ఉన్న రౌడీ షీటర్లపై ఎన్నికలు పూర్తయ్యాక రౌడీ షీట్ ఎత్తి వేసే యోజనలో ఉన్నాం. ఎన్నికలు పూర్తయ్యే వరకూ వారి ప్రవర్తన, కదలికలపై పూర్తి నిఘా ఉంటుంది. ఈ ఎన్నికలు పకడ్బందీగా, కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలి. రీపోలింగ్‌కు ఆస్కారం లేకుండా ఎన్నికలు జరగాలన్నదే ప్రధాన లక్ష్యం. – కేకేఎన్ అన్బురాజన్, ఎస్పీ

ఏపీఎంఎస్‌లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని 15 ఏపీ మోడల్ స్కూళ్ల (ఏపీఎంఎస్)ల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు డీఈఓ బి.వరలక్ష్మి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఇంగ్లిష్ మీడియంలో బోధన ఉంటుంది. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈ నెల 28 నుంచి మే 22వ తేదీలోపు https://apms.apcfss.in, www.cse.ap.gov.in వెబ్‌సైట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చొప్పన ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతి మార్కుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనల మేరకు సీట్లు కేటాయిస్తారు. పూర్తి వివరాలకు ఆయా మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలను సంప్రదించవచ్చు.

పనికిరాని పోస్టు ఇచ్చి మభ్యపెడతారా?

- చంద్రబాబు తీరుపై వడ్డెర్ల ఆగ్రహం
- ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరిక

అనంతపురం క్రైం: పనికిరాని పోస్టును ఎరగా వేసి తమ నోళ్లు మూయించాలని చూస్తే సహించబోమని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడిపై వడ్డెర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధ్యక్షుడిగా బీవీ వెంకట్రాముడిని నియమిస్తున్నట్లు ఆ పార్టీ అధిష్టానం మంగళవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీనిపై వడ్డెర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధి కోసం రేయింబవళ్లు కష్టపడ్డ శ్రీసత్యసాయి జిల్లాలోని వడ్డెర్లకు సరైన ప్రాధాన్యతను చంద్రబాబు ఇవ్వడం లేదంటూ కొంత కాలంగా ఆందోళనలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లాలో పుట్టపర్తి స్థానాన్ని వడ్డెర్లకే ఇస్తున్నట్లుగా ప్రకటించిన పార్టీ పెద్దలు... తెలివిగా వడ్డెర్లను పక్కదారి పట్టించారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె కుటుంబానికే టికెట్ ఇస్తున్నట్లుగా ముందస్తుగా గుర్తించిన వడ్డెర్లు నేరుగా బాబు ఇంటి ఎదుటే ఆందోళనకు దిగారు. పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని నాడు హామీనిచ్చిన చంద్రబాబు.. హిందూపురం పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడిగా బీవీ వెంకట్రాముడిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసి చేతులు దులుపుకోవడాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. పనికిరాని పోస్టును కట్టబెట్టిన టీడీపీ పెద్దలకు ఎన్నికల్లో సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

గుంతకల్లు టికెట్ యాదవులకివ్వాలి...

- లేదంటే తీవ్ర పరిణామాలు
- యాదవ సంక్షేమ సంఘం నాయకులు



మాట్లాడుతున్న యాదవ సంక్షేమ సంఘం నాయకులు

గుత్తి: గుంతకల్లు నియోజకవర్గ టీడీపీ టికెట్‌ను యాదవ కులస్తులకు కేటాయించకపోతే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబుకు యాదవ సంక్షేమ సంఘం నాయకులు అల్టిమేటమ్ జారీ చేశారు. గుత్తి పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో ఓ హోటల్‌లో మంగళవారం యాదవ సంక్షేమ సంఘం నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. సంఘం మండల గౌరవాధ్యక్షుడు రామకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అలియాస్ 108 శీన మాట్లాడుతూ.. గుంతకల్లు నియోజకవర్గంలో దాదాపు 60 వేల మంది యాదవ కులస్తులు ఉన్నారన్నారు. ఈ సారి తప్పనిసరిగా యాదవ కులస్తులకే ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరుతూ చంద్రబాబుకు లేఖ రాస్తామన్నారు. మూడు దశాబ్దాలుగా టీడీపీ అభ్యున్నతి కోసం యాదవులు కృషి చేశారన్నారు. అయితే యాదవులను విస్మరించడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో యాదవ సంక్షేమ సంఘం సభ్యులు ఏకాంతయ్య, రమేష్, చంద్రశేఖర్, మధుయాదవ్, రాజు, రంగాయాదవ్, చంద్రశేఖర్, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పటికప్పుడు నివేదికలు అందించండి

- ఉరవకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌కార్గ్



రాజకీయ పార్టీ నేతలతో సమావేశమైన కేతన్‌కార్గ్

ఉరవకొండ: ఎన్నికలకు సంబంధించిన నివేదికలను సకాలంలో కంట్రోల్ రూమ్ నుంచి అందించాలని సంబంధిత అధికారులను నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేతన్‌కార్గ్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంఎంయూ, సీఆర్‌యూ, ఎఫ్ఎంయూ, ఈఎంయూ, ఎస్‌డబ్ల్యూపీయూ తదితర ఇన్‌చార్జ్‌లు వారి బృందాలతో షిఫ్టుల వారీగా పని చేయించాలన్నారు. ఎన్నికల నివేదికలు త్వరితగతిన అందించాలన్నారు. అనంతరం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ఆర్ఓ కేతన్‌గార్గ్ సమావేశమై మాట్లాడారు. అన్ని రకాల అనుమతులు, ఖర్చులు, క్లయిమ్‌లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ... కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ఏడు శాఖల అధికారులతో ఆరు యూనిట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు వంద మంది సిబ్బందిని ఇందు కోసం నియమించామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడినప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.5.82లక్షల నగదుతో పాటు 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. 179 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఆర్ఓ శిరీష, తహసీల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

'మేము సిద్ధం' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఈ నెల 27 నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన మేము సిద్ధం బస్సు యాత్ర పోస్టర్లను అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించారు. బస్సు యాత్ర విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్ర చేపడుతున్నారన్నారు. ఈ యాత్ర ప్రారంభానికి ముందే ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బాలాంజినేయులు, వైఎస్సార్‌సీపీ సోషియల్ మీడియా అధ్యక్షుడు గోర్ల శ్రావణ్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు నవీన్, జానీ, కేశవరెడ్డి, నరసింహ, వాసు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్ర స్థాయి బండ లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న వృషభాలు

యాడికి: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ పోటీలకు 4 జతల వృషభాలను రైతులు తీసుకువచ్చారు. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు ప్రారంభించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పీఆర్ పల్లికి చెందిన శ్రీరాములు వృషభాలు 931.07 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. తాడిపత్రికి చెందిన రమేష్‌బాబు వృషభాలు ద్వితీయ స్థానం, నంద్యాల జిల్లా పీఆర్ పల్లికి చెందిన చెందిన నాగయ్య వృషభాలు తృతీయ స్థానం, ఊబిచెర్ల గ్రామానికి చెందిన పుల్ల గోవిందు వృషభాలు నాల్గో స్థానం దక్కించుకున్నాయి. విజేత వృషభాల యజమానులకు నగదు పురస్కారాలతో నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో గోదావరి కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన నాగరాజు, ఉమ్మడి పాల ప్రభాకర్ రెడ్డి, యర్రగుడి పెద్దయ్య, వంకం పెద్ద కంబగిరిస్వామి, ఎంపీటీసీ సభ్యుడు వెంకట్రాముడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్, ఆలయ ధర్మకర్త బొంబాయి రామిరెడ్డి, జేసీ చిన్న నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలు విడుదల

అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పూర్తి చేసిన పలు పనులకు సంబంధించి బకాయిలను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు చేపట్టారు. వీటికి సంబంధించి రూ.2.15కోట్ల బకాయి నిధులు మంజూరైనట్లు వివరించారు. నిర్మాణాలు పూర్తి చేసి బిల్లుల కోసం నివేదికలను ఇప్పటికే పంపించిన కాంట్రాక్టర్ల ఖాతాల్లో నిధులను జమ చేయనున్నట్లు పేర్కొన్నారు.

చంద్రబాబు ఆరోపణలు హాస్యాస్పదం

- ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి



ఉరవకొండ: రాష్ట్రంలో ప్రజల ఆస్తులకు రక్షణ లేదంటూ కుప్పం సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు చేసిన ఆరోపణలు హాస్యాస్పదమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అన్నారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు హయాంలో భూమి, పట్టాదారు పాసు పుస్తకాల హక్కుల సవరణ చట్టం చేశారన్నారు. భూమి రిజిస్ట్రేషన్ చేసేటప్పుడే పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్ అవసరం లేదని పేర్కొంటూ 2016లో జీఓ నంబర్ 229 విడుదల చేశారని గుర్తు చేశారు. ఈ అంశాలను పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వంపై బురదచల్లేందుకు చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత చట్టంలోని లోపాలను సరిదిద్ది లక్షలాది మంది పేద రైతులకు యాజమాన్య హక్కు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించడం విప్లవాత్మకమన్నారు. ఎక్కడేగాని అక్రమాలకు తావు లేకుండా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి అండగా జగన్ సర్కార్ ప్రభుత్వం నిలుస్తోందన్నారు.

ఓటర్లకు 'పచ్చ' ప్రలోభాలు

- పార్టీలోకి చేరే వారి స్థాయిని బట్టి ధర నిర్ణయించిన జేసీ

తాడిపత్రి అర్బన్: ఈ ఎన్నికల్లో తమకు ఓటమి తప్పదని భావించిన జేసీ సోదరులు అడ్డదారులకు తెరలేపారు. ఎక్కడైతే తమకు గట్టి పోటీ ఉంటుందని భావిస్తున్నారో అక్కడే తాయిలాలు అందజేస్తూ ఓటర్లకు ఎరవేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి చేరే వ్యక్తి స్థాయిని బట్టి ధర నిర్ణయించి సంతల్లో పశువుల్లా కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే నిర్ణయించిన ధరను ఎన్నికల్లో గెలిచిన తర్వాతనే చెల్లిస్తామంటున్నారు. ఒకరు చేరితే రూ.10వేలు, పది మందితో చేరితే రూ.30 వేల నుంచి రూ.40 వేలు చొప్పున ఆఫర్‌లు ప్రకటించినట్లు తెలుస్తోంది. దీంతో పచ్చ ప్రలోభాలపై పక్కా ఆధారాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం రాత్రి తాడిపత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. టైలర్స్ కాలనీలో నివాసముంటున్న జేసీ ప్రభాకరరెడ్డి అనుచరుడు మౌలాలి అదే కాలనీలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులతో పాటు తటస్థంగా ఉన్న పలువురిని కలసి జేసీ ప్రభాకరరెడ్డి ప్రకటించిన ఆఫర్లను వివరించాడు. దీనిపై నేరుగా అన్న (జేసీ ప్రభాకరరెడ్డి)తో కానీ, కాకర్ల రంగనాథ్ లేదా షిలార్‌తో మాట్లాడండి అంటూ ఫోన్లు చేయిస్తున్నాడు. గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయిన వారికైతే రూ.5లక్షలు ఇస్తామంటూ ఆఫర్ చేశారు. దీంతో మౌలాలి తీరుపై వైఎస్సార్‌సీపీ మసూద్‌వలి, తేజారెడ్డి, అల్లాబకాష్ చేసిన ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టారు.

అంజలి మృతిపై అనుమానాస్పద కేసు నమోదు

అనంతపురం: కలెక్టరేట్ ఎదుట ఫెర్రర్ విగ్రహం కింద బస చేస్తున్న అంజలి సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే అంజలి మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే ఆమె మృతిపై భిన్న వాదనలు వినిపిస్తుండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కాగా, 14 సంవత్సరాల క్రితం పెద్దలను ఎదిరించి రాజు అనే వ్యక్తిని ప్రేమ వివాహం చేసుకున్న అంజలికి ముగ్గురు సంతానం కలిగారు. కొన్ని రోజులు వీరి కాపురం సజావుగా జరిగింది. ఆ తర్వాత రాజు మద్యానికి బానిసయ్యాడు. ముగ్గురు సంతానంతో దేవాలయాల వద్ద భిక్షాటన చేయిస్తూ వచ్చిన డబ్బును తీసుకెళ్లి రాజు మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో మరోసారి అంజలి గర్భం దాల్చింది. ప్రస్తుతం నాలుగో నెల నడుస్తున్న ఆమె ఈ నెల 24న మృతి చెందింది. ఆమె మృతి ఆకలితోనా? రోడ్డు ప్రమాదమా? ఏదైనా అఘాయిత్యమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో గురువారం ఆమె మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిర్వహించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

18 మందిపై సస్పెన్షన్ వేటు

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన 15 మంది వలంటీర్లు, ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి ఎం.గౌతమి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో గుంతకల్లు నియోజకవర్గం పరిధిలో వలంటీర్లు కె.దివాకర్, వై.మహమ్మద్ నవీద్, ఎం.నసీర్‌హుసేన్, ఎం.దాదా ఖలందర్, సి.రాజేష్‌బాబు, పెనుకొండ షానవాజ్ ఖాన్, రాయదుర్గం నియోజకవర్గం పరిధిలో బి.వన్నూరుస్వామి, బి.వన్నేష్, ఎస్.భీమన్న, బంగి వన్నూరుస్వామి, మొక శరణబసవ, వై.హనుమంతు, మొక నాగరాజు, వాల్మీకి భాస్కర్, అడివప్పగారి ప్రసాద్‌తో పాటు తాడిపత్రి మునిసిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఆర్.రామరాజు, వి.వెంకటరమణ, జి.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు. కాగా, సి–విజిల్ ద్వారా మంగళవారం 10 ఫిర్యాదులు అందాయి. దీంతో ఇప్పటి వరకూ 191 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించి నివేదికను ఎన్నికల కమిషన్‌కు పంపించారు.

ఎన్నికల విధుల నుంచి 431 మందికి మినహాయింపు

అనంతపురం అర్బన్: ఎన్నికల విధుల నుంచి 431 మంది ఉద్యోగులకు మినహాయింపునిచ్చారు. విధులు కేటాయించిన ఉద్యోగుల్లో గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, తీవ్ర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి మినహాయింపునకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలో విద్యాశాఖ నుంచి 499 మంది ఉపాధ్యాయులు, ఇతర శాఖల నుంచి 581 మంది చొప్పున మొత్తం 1,080 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వీరి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ 10 రోజులుగా కొనసాగుతూ వచ్చింది. మొత్తం 1,080 మంది దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ చేపట్టగా 571 మంది గైర్హాజరయ్యారు. 499 మంది ఉపాధ్యాయుల్లో 199 మంది గైర్హాజరయ్యారు. హాజరైన 300 మందిలో 245 మందికి మినహాయింపు కల్పించారు. ఇతర శాఖలకు సంబంధించి 581 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా విచారణకు 372 మంది గైర్హాజరయ్యారు. హాజరైన 209 మందిలో 186 మందికి మినహాయింపు ఇచ్చారు.

కూడేరు ఎంఈఓ, ఇన్విజిలేటర్‌కు షోకాజ్ నోటీసు

- నిబంధనలు పాటించకుండా పదో తరగతి పరీక్షల నిర్వహణ
- ఒకే బెంచీపై ఇద్దరు విద్యార్థులకు చోటు

అనంతపురం ఎడ్యుకేషన్: నిబంధనలు పాటించకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న విషయం డీఈఓ వరలక్ష్మి ఆకస్మిక తనిఖీలో వెలుగు చూసింది. మంగళవారం కూడేరు జెడ్పీహెచ్ఎస్‌కు చేరుకున్న ఆమె గేటు తెరచి బయటకు వస్తున్న వ్యక్తిని అడ్డుకుని ప్రశ్నించారు. తాను వాటర్‌బాయ్‌నని సమాధానం చెబుతూ సార్ చెప్పడంతో టీ తీసుకువచ్చేందుకు వెళుతున్నట్లు తెలిపాడు. దీంతో సదరు వ్యక్తిని బయటకు పంపి పరీక్ష ముగిసే వరకూ లోపలికి రావద్దని డీఈఓ ఆదేశించారు. అనంతరం ఓ గదిలో ఒకే టేబుల్‌పై ఇద్దరు విద్యార్థులు కూర్చొని పరీక్ష రాస్తుండడాన్ని గుర్తించి ఎంఈఓ చంద్రశేఖర్‌ను నిలదీశారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక బెంచీపై ఇద్దరు విద్యార్థులను ఎలా కూర్చోబెడతారని ప్రశ్నించారు. ఫర్నీచర్ కొరత ఉందంటూ ఎంఈఓ తెలపడంతో ముందుగానే ఈ విషయం తన దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ పరీక్షలు నిర్వహిస్తున్నారంటూ మండిపడ్డారు. టీ కోసం వాటర్ బాయ్‌ను బయటకు పంపిందెవరంటూ ఆరా తీయడంతో ఇన్విజిలేటర్ అడవిరాజు అని తేలింది. దీంతో పరీక్షల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన ఎంఈఓ చంద్రశేఖర్, ఇన్విజిలేటర్ అడవి రాజుకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా

ఆల్ హబీబ్ మసీదులో ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: నగరంలోని ఖాజానగర్ ఆల్ హబీబ్ మసీదులో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలియజేశారు. వారికి ఆయన స్వయంగా భోజనం వడ్డించారు. మ్మెల్యేకి పలువురు ముస్లింలు ఖర్జూరాలు తినిపించారు. మేయర్ వసీం, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు మహబూబ్ బాషా, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

కనగానపల్లి: రాప్తాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి బుధవారం నుంచి మండలంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు. తొలిరోజు మండలంలోని పర్వతదేవరపల్లి గ్రామం నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి దాదులూరు, కుర్లపల్లి, మామిళ్లపల్లి గ్రామాల్లో కొనసాగనున్నట్లు ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఏపీజీబీ వేణుగోపాలనగర్ శాఖ ప్రారంభం



బ్యాంకు బ్రాంచిని ప్రారంభిస్తున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్‌కశ్యప్

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక గుత్తిరోడ్డులో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) శాఖ కార్యాలయాన్ని పాత విద్యానికేతన్ స్కూల్ దగ్గర అధునాతనంగా నిర్మించిన నూతన భవనంలోకి మార్చారు. ఏపీజీబీ చైర్మన్ రాకేష్‌కశ్యప్ మంగళవారం భవనాన్ని ప్రారంభించారు. ప్రభుత్వరంగ బ్యాంకుగా అన్ని వర్గాలకు అధునాతన సేవలు అందిస్తున్న ఏపీజీబీని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. విరివిగా రుణాలు అందించడం, డిపాజిట్లపై అత్యధిక వడ్డీరేట్లు ఇవ్వడం ఏపీజీబీ ప్రత్యేకత అన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ పి.శ్రీదేవి, బ్రాంచి మేనేజర్ రెడ్డప్ప, సీనియర్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌కు లోబడి ఎరువుల విక్రయాలు

అనంతపురం అగ్రికల్చర్: ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ఎరువుల విక్రయాలు చేపట్టాలని ఏడీఏ ఎం. రవి ఆదేశించారు. మంగళవారం డివిజన్ కార్యాలయంలో ఎరువుల డీలర్లు, ఆరు మండలాల ఏఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్బీకేలు, సొసైటీలు, డీసీఎంఎస్, ప్రైవేటు, హోల్‌సేల్ డీలర్లు ఎరువులు విక్రయించేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. కొన్ని ఎరువులకు రాజకీయ నాయకుల ఫొటోలు ముద్రించారని, రైతులకు విక్రయించేటప్పుడు కనిపించకుండా వాటికి పెయింటింగ్ వేసి ఇవ్వాలన్నారు. ఆయా భవనాల్లో ఫొటోలు కనిపించకుండా చూడాలన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో వ్యాసరచన పోటీలు



బహుమతులు అందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల 7వ బ్రాంచ్‌లో 'మై స్కూల్ మై ప్రైడ్ 'అనే అంశంపై విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పర్వీన్, డీన్ చంద్రమోహన్ పాల్గొన్నారు.

'రక్షణ కల్పించాలి'

అనంతపురం టవర్ క్లాక్: నెల్లూరు హిజ్రా హాసిని నుంచి తమకు రక్షణ కల్పించాలని మన విజయం సంఘం జిల్లా అధ్యక్షురాలు మయూరి కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. హిజ్రాలు చిట్టి, రమణమ్మ, విన్ను శర్మ, రాధ, సరిత, అంజలి, కరిష్మా పాల్గొన్నారు.

అండర్‌పాస్

- ఆర్‌ఓబీ అండర్ పాస్‌లో రాకపోకలు షురూ
- 1,2,3,3,4,5 రోడ్లు, లక్ష్మీనగర్, కోవూర్‌నగర్‌వాసులకు ఊరట
- ఆర్‌ఓబీ ఏర్పాటులో ఎమ్మెల్యే అనంత మార్క్
- ట్రాఫిక్ సమస్య లేకుండా సకాలంలో గమ్యస్థానాలకు..



అండర్ పాస్ నుంచి రాకపోకలు సాగిస్తున్న జనం

అనంతపురం కార్పొరేషన్: రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఏర్పాటైన క్లాక్‌టవర్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం జిల్లాకే తలమానికంగా నిలిచింది. బ్రిడ్జ్ పనులు ఎంత వేగంగా జరిగాయో అదే తరహాలో అండర్ పాస్ పనులు పూర్తయ్యాయి. మంగళవారం వాహనాల రాకపోకలు ప్రారంభయ్యాయి. దీంతో 1,2,3,4,5 రోడ్లు, లక్ష్మీనగర్, కోవూర్‌నగర్ ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా సకాలంలో క్లాక్‌టవర్ వైపు వచ్చేందుకు మార్గం సుగుమమైంది. దీంతో పాటుగా క్లాక్‌టవర్ సర్వీసు రోడ్డు భూసేకరణకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. త్వరలో సర్వీసు రోడ్డు పనులు ప్రారంభం కానున్నాయి.

రూ.311.93 కోట్లతో ఆర్‌ఓబీ

అనంతపురం–టవర్‌క్లాక్ రైల్వే ఓవర్ బ్రిడ్జిని 1965లో నిర్మించారు. బ్రిడ్జి దెబ్బతినడంతో పాటు ట్రాఫిక్‌కు ప్రతిబంధకంగా మారింది. జాతీయ రహదారి పరిధిలో ఉన్న ఈ బ్రిడ్జిను గత టీడీపీ ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాల కోసం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకొచ్చింది. ఐదు దశాబ్దాల తర్వాత నూతన బ్రిడ్జి ఏర్పాటుపై అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి దృష్టి సారించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపడితే రాబోయే 50 ఏళ్లకు ఎంత జనాభా పెరిగినా ట్రాఫిక్ సమస్య లేకుండా ఉంటుందని, నేషనల్ హైవే పరిధిలోకి బ్రిడ్జిను తీసుకురావాలన్న ప్రతిపాదనలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో 2020 నవంబర్‌లో నేషనల్ హైవేస్ పరిధిలో బ్రిడ్జిని తీసుకొచ్చారు. 2021 మే 3న బళ్లారి బైపాస్ వద్ద జాతీయ రహదారి–44ను కలుపుతూ నగర శివారు పంగల్ రోడ్డు వద్దనున్న చెన్నై హైవేకి అనుసంధానిస్తూ కేంద్రం రూ.311.93 కోట్లతో అర్బన్ లింక్ ప్రాజెక్టును చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. నిర్దేశిత సమయం కంటే ఐదు నెలలు ముందుగానే బ్రిడ్జిని అందుబాటులోకి తేవడంతో బళ్లారి బైపాస్, కళ్యాణదుర్గం బైపాస్ నుంచి నగరానికి వచ్చే వారికి ఎటువంటి ట్రాఫిక్ సమస్య లేకుండా సకాలంలో నగరంలోకి వచ్చే వెసులుబాటు లభించింది.

అండర్‌పాస్‌లో రాకపోకలు మరింత సులభం

అండర్ పాస్ అందుబాటులోకి రావడంతో ప్రజల రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. గతంలో 1,2,3,4,5 రోడ్ల ప్రజలు క్లాక్‌టవర్ వైపు రావాలంటే బ్రిడ్జి చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. 1వ రోడ్డు ఎక్స్‌టెన్షన్ ఎస్ మ్యాక్స్ మీదుగా సైపుల్లా బ్రిడ్జ్ నుంచి నగరంలోకి రావాల్సి వచ్చేది. లక్ష్మీనగర్, కోవూర్‌నగర్ ప్రజలు..పీటీసీ నుంచి బ్రిడ్జి మీదుగా క్లాక్‌టవర్ వైపు రావాల్సి వచ్చేది. అండర్ పాస్ ఏర్పాటుతో తక్కువ సమయంలో నేరుగా నగరంలోకి వచ్చే సదుపాయం ఏర్పడింది. సకాలంలో అండర్ పాస్ అందుబాటులోకి రావడంతో ఆ ప్రాంత వాసుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.



నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు

రాకపోకలు సులభతరం



అండర్‌పాస్‌ను పరిశీలిస్తున్న మేయర్ వసీం, నాయకులు

రైల్వే అండర్ పాస్ అందుబాటులోకి రావడంతో టవర్‌క్లాక్ వైపు రాకపోకలు సులభతరమవుతాయని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం మేయర్ వసీం అండర్ పాస్‌లో నడుచుకుంటూ 1వ రోడ్డు వైపునకు వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో నగరంలో రూ.వెయ్యి కోట్లతో ప్రధాన, అంతర్గత రోడ్లు, కాలువలను ఏర్పాటు చేశామన్నారు. అండర్ పాస్ ఏర్పాటుతో లక్ష్మీనగర్, 1,2,3,4,5 రోడ్డు ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. నగర చరిత్రలో లేని విధంగా అభివృద్ధి జరుగుతోందని, మరోసారి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని రానున్న ఎన్నికల్లోనూ గెలిపించుకుందామని మేయర్ పిలుపునిచ్చారు. మేయర్ వెంట వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా 'అనంత'



అభివృద్ధికి కేరాఫ్‌గా అనంతపురం నిలుస్తోంది. ఈ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో బ్రిడ్జిను సకాలంలో ఏర్పాటు చేశారు. ఇప్పుడు అండర్‌పాస్ పనులు పూర్తి కావడంతో ఊరట లభించింది. మొదటి రోడ్డులో ఉన్న మా అగరబత్తీల షాప్ నుంచి క్లాక్‌టవర్ వైపు వెళ్లాంటే ఇబ్బంది పడేవాళ్లం. ట్రాఫిక్ సమస్యతో గంట సమయం పట్టేది. ఇప్పుడు నిమిషాల్లో క్లాక్‌టవర్ వైపునకు వస్తున్నాం. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

–ప్రసాద్, శ్రీదేవి, ఆజాద్‌నగర్

3 కిలోమీటర్లు తిరిగేవాళ్లం



బ్రిడ్జి నిర్మాణం సమయంలో సప్తగిరి సర్కిల్, రాంనగర్, లక్ష్మీనగర్ మీదుగా కళ్యాణదుర్గం బైపాస్‌కు వెళ్లాంటే పెట్రోల్ ఖర్చుతో పాటు 3 కిలోమీటర్లు వెళ్లాల్సి వచ్చేది. ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండేది. బ్రిడ్జి సకాలంలో పూర్తి చేయడంతో ఊపిరి పీల్చుకున్నాం. 1వ రోడ్డు నుంచి క్లాక్‌టవర్ వైపు రావాలన్నా..5వ రోడ్డు బ్రిడ్జి ప్రవేశ మార్గం నుంచి బ్రిడ్జిపై నుంచి రావాల్సి వచ్చేది. అండర్ పాస్‌తో నిమిషాల వ్యవధిలో గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. ప్రభుత్వం మంచి చేస్తోంది.

– సురేంద్ర, అనంతపురం

అనంతలో సినిమా షూటింగ్



షూటింగ్‌లో పాల్గొన్న నటీనటులు

అనంతపురం కల్చరల్: పామిడి కేంద్రానికి చెందిన అనిల్‌రెడ్డి దర్శక పర్యవేక్షణతో స్వీయ నిర్మాణంలో ప్రారంభమైన చిత్ర షూటింగ్ జిల్లాకేంద్రంలో సందడి చేసింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు నగరంలోని పలుచోట్ల నటీనటులపై సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత అనిల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంకా పేరు పెట్టని చిత్రం దేశభక్తితో పాటూ ఎంటర్‌టైనర్‌గా సాగుతుందన్నారు. సలార్ చిత్రంలో హీరో ప్రభాస్‌తో పాటూ మెయిన్ విలన్‌గా నటించిన యోగికత్ర ఇందులోనూ ప్రతినాయక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపాడు. సౌత్ ఇండియా ఇండస్ట్రీలో ఉన్నవారితో తీస్తున్నందున ఈ ఏడాది ఆఖరికి అన్ని రాష్ట్రాల్లో విడుదల చేస్తామన్నారు. అనంత కళాకారులకు అవకాశం కల్పించడానికి కొన్ని షాట్లను ఇక్కడి ప్రాంతాలలో తీశామని త్వరలో పెద్ద నగరాల్లో చిత్ర షూటింగ్ జరుగుతుందన్నారు. ఇటీవల అనంత సుందరంగా తయారైందని షూటింగులు జరుపుకోవడానికి అనువుగా ఉందని హర్షం వెలిబుచ్చారు.

నరేష్‌కు డాక్టరేట్



కుమ్మర నరేష్

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలోని ఇంగ్లిష్ విభాగంలో పరిశోధన చేసిన కుమ్మర నరేష్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. వర్సిటీ ఇంగ్లిష్ విభాగం ప్రొఫెసర్ వీబీ చిత్ర పర్యవేక్షణలో ప్రముఖ ఆంగ్ల రచయిత కేవీ రఘుపతి రచనల్లోని ముఖ్యాంశాలు(సెలెక్ట్ పోయమ్స్ ఆఫ్ కే.వీ. రఘుపతి – ఏ. థిమాటిక్ స్టడీ) అనే అంశంపై పరిశోధన చేశారు. ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు. బెంగళూరు, ప్రెసిడెన్సీ వర్సిటీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ జి. హంపమ్మ, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ వీబీ చిత్ర, శ్రీ పద్మావతి వర్సిటీ ,తిరుపతి ప్రొఫెసర్ వైఎస్ శారద ఆధ్వర్యంలో రీసెర్చ్ వైవా నిర్వహించారు.

జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



మహిళకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, కరోనా సమయంలోనే ఈ రెండింటినీ ఆపలేదని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి గుర్తు చేశారు. మంగళవారం 4వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్ సీపీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చేపట్టారు. ఆ డివిజన్‌లో ప్రతి గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ఎమ్మెల్యే ప్రజలకు అందించారు.ఈసందర్భంగా సీఎం వైఎస్ జగన్ నాయకత్వంలో నగరం రూపురేఖలు మార్చేశామన్నారు. నగరపాలక సంస్థ చరిత్రలో లేని విధంగా నగరం నలుదిక్కులా అభివృద్ధి చేశామన్నారు. గుత్తి రోడ్డు, రాజీవ్‌కాలనీ, రుద్రంపేట, జేఎన్‌టీయూ, రైల్వే ఓవర్ బ్రిడ్జ్, తదితర రోడ్లను ఏర్పాటు చేసి ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రతి డివిజన్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లకు తగ్గకుండా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

సీఎం విప్లవాత్మక సంస్కరణలు

సీఎం వైఎస్ జగన్ విజన్ ఉన్న నాయకుడని, అన్నిరంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేశారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేదరికాన్ని రూపుమాపడానికి విద్య ఒక్కటే ప్రధాన ఆయుధంగా భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడంతో పాటు ఇంగ్లిష్ మీడియాన్ని ప్రవేశపెట్టారన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి తేవడం ద్వారా సామాన్యులకు 8 రకాల స్పెషాలిటీ వైద్య సేవలను అందుతున్నాయన్నారు. కోవిడ్ సమయంలో ఆస్పత్రుల్లో మంచాలు లేక రోగులు అవస్థలు పడకూడదని సూపర్ స్పెషాలిటీలోనే మెరుగైన వైద్యం అందించి ఎంతో మంది ప్రాణాలను కాపాడింది తమ ప్రభుత్వమేనన్నారు. జిల్లా సర్వజనాస్పత్రిలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, తదితర పోస్టులను భర్తీ చేయడమే కాకుండా అత్యాధునిక వైద్యాన్ని ప్రజలకందిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లోనూ సీఎంగా వైఎస్ జగన్ ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకెళ్తుందన్నారు. మేధావులు, యువత ముందు చూపుతో ఒక్కసారి ఆలోచించి వైఎస్సార్‌సీపీ పట్టం కట్టాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మేయర్ వసీం, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, కార్పొరేటర్లు కమల్‌భూషణ్, లాలు, దుర్గాదేవి, సాకే చంద్ర, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైపుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కృష్ణవేణి, హుసేన్, అనిల్‌కుమార్ గౌడ్, మన్నల సత్యనారాయణ, నాగార్జునరెడ్డి, జనార్దన్‌రెడ్డి, హనుమంతు, చింతకుంట మధు, జానీ, తనీష, రాధా, పార్వతి, ఉష, భానుమతి,దేవి, గౌరి, భారతి, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీనివాసనగర్‌లో...

నగరంలోని ఐదో డివిజన్ శ్రీనివాసనగర్‌లో బుధవారం ఉదయం 7 గంటలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం ప్రారంభం కానుంది.

ముస్లింల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ వసీం, నాయకులు

అనంతపురం కల్చరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమని నగర మేయర్ వసీం అన్నారు. మేయర్ వాసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ స్థానిక నాల్గో రోడ్డులోని చాందినీ మసీదు సమీపంలో మతపెద్దలతో మాట్లాడారు. హజ్ యాత్రికులపై అదనపు భారం పడకుండా సీఎం జగన్ అండగా నిలిచారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో సైతం ఎమ్మెల్యే అనంత 9 మంది ముస్లింలకు కార్పొరేటర్లు, మేయర్‌గా, మార్కెట్‌యార్డు చైర్మన్‌గా అవకాశం ఇచ్చారన్నారు. కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కోఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, నాయకులు నియాజ్, కేఎం బాషా, దాదా ఖలందర్, వేముల నదీమ్, హబీబుల్లా, షేక్షావలి, అమ్ము, కిశోర్, మదార్‌వలి, అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దాం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్దామని మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, ముస్లింలకు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్షలాది మంది మైనార్టీల ఉన్నత పదవుల్లో ఉన్నారంటే అందుకు వైఎస్సార్ అందించిన 4 శాతం రిజర్వేషనే కారణమన్నారు. ఆ మహానేత ఆశయాలకనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మైనార్టీలు అన్ని విధాల అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్పొరేటర్లు ఇసాక్, రహంతుల్లా, కో ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నియాజ్, జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, నాయకులు షేక్ ఖాజా పీరా, జావెద్, నదీం, మహబూబ్‌బాషా,బాకే హబీబుల్లా, బాషా,తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపిద్దాం



ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాప్తాడురూరల్: వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిని బోయ శాంతమ్మ, రాప్తాడు ఎమ్మెల్యే అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని బంఫర్ మెజార్టీతో గెలిపిద్దామని రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయయాదవ్, ఎంపీపీ వరలక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ట్రేడ్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు బండి పవన్ కోరారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ సిండికేట్‌నగర్, రావి నారాయణరెడ్డికాలనీ, నరసింగయ్య కాలనీల్లో ప్రచారం చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటా వివరిస్తూ, ఓటును 'ఫ్యాన్' గుర్తుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో సంక్షేమాభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న గెలుపొందాలన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని సంక్షేమం ఆపకుండా అందరికీ అందించి తోడుగా ఉన్నారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల పేరుతో తమ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేశారని మహిళలు పేర్కొన్నారు. మళ్లీ జగనన్నకే తమ ఓటు వేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బండా అంజియాదవ్, ఎంపీటీసీ గౌస్, కొడిమి సర్పంచ్ సుబ్బిరెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎంపీపీ సూర్యనారాయణరెడ్డి, భానుకోట శివ, బాలకృష్ణ, రాము, స్టోర్ డీలరు రామాంజి, రామస్వామి, సుంకన్న, ఆనంద్, బాలదాసు తదితరులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో మార్మోగిన న్యామద్దెల



పూజల్లో పాల్గొన్న తోపుదుర్తి రాజశేఖరరెడ్డి

చెన్నేకొత్తపల్లి: న్యామద్దెల గ్రామం గోవింద నామస్మరణతో మార్మోగింది. గ్రామంలోని దళతవాడలో లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి ఉత్సవాలు గ్రామపెద్దల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. మంగళవారం ఉదయం ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. ఉత్సవాలను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు తోపుదుర్తి రాజశేఖరరెడ్డి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక నాయకుడు రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

వందశాతం లక్ష్యం సాధించాం

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది నిర్దేశించుకున్న రూ.10.81 కోట్లు పన్ను వసూళ్ల లక్ష్యం మంగళవారం వందశాతం సాధించామని మార్కెటింగ్‌శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న 9 మార్కెట్‌యార్డులు, 15 చెక్‌పోస్టుల ద్వారా గడువులోపు ఈ ఘనత పూర్తయిందని పేర్కొన్నారు. వర్షాభావంతో కరువు పరిస్థితులు నెలకొన్నా... చాలా మార్కెట్ కమిటీలు సులభంగా లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపారు. ఇంకా నాలుగైదు రోజులు సమయం ఉన్నందున బకాయిల వసూళ్లపై మార్కెట్ కమిటీలు దృష్టి సారించాయని పేర్కొన్నారు. గతేడాది మాదిరిగా ఈ సారి కూడా కడప రీజియన్‌లో 'అనంత'ను ముందంజలో నిలపడానికి చర్యలు తీసుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా ఏప్రిల్ ఒకటి నుంచి ప్రారంభం కానున్న 2024–25 ఏడాదికి రూ.11.75 కోట్లు వసూళ్లు చేయాలని ఇప్పటికే సూత్రప్రాయంగా లక్ష్యనిర్దేశన జరిగిందని పేర్కొన్నారు.

బాలసదనంలో చిన్నారులకు ఆశ్రయం

అనంతపురం సెంట్రల్: కలెక్టరేట్ ఎదురుగా సోమవారం అంజలి అనే వివాహిత మృతి చెందిన విషయం తెలిసిందే. ఆమె పిల్లలకు బుడ్డప్పనగర్‌లోని బాలసదనంలో ఆశ్రయం కల్పించారు. ఆమె మృతిపై పత్రికల్లో భిన్న కథనాలు ప్రచురితం కావడంతో మంగళవారం ఆర్డీఓ వెంకటేష్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రామలక్ష్మి, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, ఆర్‌ఐ సందీప్‌కృష్ణ, వీఆర్వో షానవాజ్, అర్బన్ సీడీపీఓ లలితమ్మ, సాయి ట్రస్టు నిర్వాహకులు విజయ్‌సాయి తదితరులు విచారించారు. తర్వాత అంజలి భర్త రాజుకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలు చిట్టి (13), చింటు (10), సాయి (9) బాలసదనంలో ఆశ్రయం కల్పించారు.

వైభవంగా మలహోబిలేశుడి పరుష

ఆత్మకూరు: పంపనూరు కొండపై మలహోబిలేశుడి పరుష మంగళవారం వైభవంగా జరిగింది. అర్చకులు లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వై.కొత్తపల్లి, పంపనూరు, ఆత్మకూరు, పంపనూరు తండా, వడ్డుపల్లి గ్రామానికి చెందిన భక్తులు పన్నేరపు బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి వారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

వర్సిటీ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. మైక్రోసాఫ్ట్, ఎస్‌ఏపీ కంపెనీల సహకారంతో ఎండోమెంట్ ఫౌండేషన్ అనే సంస్థ ' టెక్ సాక్ష్యం' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద విద్యార్థులకు కావాల్సిన నైపుణ్యాలు పెంపొందించేందుకు ఉచిత శిక్షణ కల్పించారు. ఇందులో శిక్షణ పొందిన అన్ని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఇటీవల రాయలసీమ వర్సిటీలో 'రీజనల్ షో కాస్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇందులో ఐదు అత్యుత్తమ జట్లను ఎంపిక చేశారు. ఇందులో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు పి. మాధవి, ఎస్. మెర్సీకి మూడో స్థానం, ఎం. హరిత, కే. ఇమాన్యుల్ హక్‌కు నాలుగో స్థానం, ఎస్. మహమ్మద్ జుబైర్ 5వ స్థానం దక్కింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర , సీఎస్ఈ విభాగాధిపతి, టెక్ సాక్ష్యం ఆఫీసర్ పీఆర్ రాజేష్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్ కుమార్ గౌడ్ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

IN THE COURT OF THE PRL. SENIOR CIVIL JUDGE, ANANTHAPURAMU

I.A.No. 21/2023 in O.S. No. 88/2022

Between :

Yeddula Ravi Chandra Reddy .... Petitioner/Plaintiff

and

Karnatakam Thirumalesu and another ....Respondents/Defendants

NOTICE TO RESPONDENT NO. 1 / DEFENDANT NO. 1

To, Karnatakam Thirumalesu, S/o. K. Ramakrishna, R/of D.No. 23-261, Amudala Street, Old Town, Anantapuramu.

పై నెంబరు కేసులో 1వ ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 24-04-2024వ తేది ఉదయం 10-30 గంటలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వతహాగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన అక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పుట్టపర్తి ప్రభాకరరెడ్డి, అడ్వకేటు అనంతపురము. సెల్: 9849250377

PUBLIC NOTICE

To whom so ever it concern, it is hereby informed to the General Public that, my client by name **Smt. Vellaboyana Surekha W/o. Gangireddy Sreenivasa Reddy, residing at D.No. 5-16, Bhairav Nagar, Anantapuramu Town & Dist.** is intending to avail a loan by offering to mortgage the schedule property in favour of any bank or financial institution. But the said **Smt. Vellaboyana Surekha** has stated she has lost of one of the original link document (i.e. **regd. Sale deed dt. 25.7.1956 bearing Doc. No. 2436/1956 which is in favour of P. Govindappa S/o. Narappa**) while going from Kalyandurg Bypass to Bhairava Nagar, Anantapuram Town and in spite of her sincere efforts she could not trace out the same and for which she lodged a complaint on 13-03-2024 at Rapthadu Police Station with regard to loss of the above said original link document and obtained a certificate from the said police station on 22-03-2024. As such at present she is in possession of only certified copy of the above said lost original link document with her.

So, if anybody is having any sale, mortgage, lease or disputes relating to schedule mentioned property, please inform the same to me or my client **Smt. Vellaboyana Surekha** within **10 (Ten)** days from the date of publication of this notice, failing which my client **Smt. Vellaboyana Surekha** will avail loan by handing over her original title deeds along with the above said certified copy of lost original link document to the said bank or financial institutions.

SCHEDULE

House site property to an extent of **A.C.0.05** out of A.C. 12.68 out of Sy.No. 328/1 situated in Anantapuramu Grama Polam & Rural Panchayat area within R.D. & S.R.D. of Anantapur.

ADMEASURING: East-West : 53 ft.; North-South: 41 ft. (i.e., **242 Sq. yds.**)

BOUNDED BY : East: Rastha, West: Plots of Kullayappa & Dr. Nagasain North: Plots sold by R. Jayaramaraju to others; South: Rastha.

T.VISWANTH, ADVOCATE, ANANTAPUR.MOBILE NO. 9440285641